

# ఓల్డ్ ఫూల్స్

రిటైరైపోవడం కూడా ఒక జబ్బే అనిపించింది రిటైరైపోయాక.

తాతల నాటి ఇల్లు కాబట్టి స్వగ్రామం వెళ్ళి వుండక తప్పలేదు. తినడం పడుకోవడం తప్ప వేరేపనిలేక కాలం గడవక తన్నుకు చస్తుండేవాడిని.

అలాంటప్పుడు శ్రీపతి పళ్ళకొట్లోకో విఠల్‌రావు పొగాకు కంపెనీకో వెళ్ళి కాలక్షేపం చేస్తుండేవాడిని. శ్రీపతి కొట్లో పళ్ళ వాసన ఘుమ ఘుమలాడుతూ వుంటే, విఠల్‌రావు ఆఫీసులో బ్రాందీ వాసన పలావు పరిమళాలతో కలగాపులగంగా వుండేది.

ఫస్ట్ ఫారం నుంచి స్కూల్ ఫైనల్ వరకూ బెంచీ మేట్సుం కాబట్టి, నాకు కాలక్షేపం కావాలి కాబట్టీ, వాళ్ళు వాయించుకునే స్వంత డబ్బాలు, వాళ్ళతో అవసరాలు ఉన్న వాళ్ళు నొక్కే సన్నాయి నొక్కుళ్ళూ ఓపిగ్గా వింటూ లోకజ్ఞానం సంపాదిస్తుండే వాడిని. అప్పుడప్పుడూ వాళ్ళతోపాటే క్యాంపులకు వెళ్ళడం కూడా పరిపాటే.

ఒక రోజు శ్రీపతి నన్నూ, విఠల్‌రావునీ వాళ్ళ మామిడి తోటకి తీసుకెళ్ళాడు.

పుష్ప, ఫల భరితమైన తోటలో విహరిస్తూ ఉంటే నాకు చాల ఉల్లాసం కలిగింది.

తోట మధ్యకి రాగానే పాలరాతితో కట్టించిన మండపం నన్ను ఎంతో ఆకర్షించింది. మధ్యలో సమాధి ఎవరిదో గాని దానికి ఖర్చుపెట్టిన డబ్బుతో నా బోటి వాడొక డాబా ఇల్లు కట్టుకోవచ్చును.

"ఎవరిదిరా ఈ సమాధి? బ్యూటిఫుల్" అన్నాను.

"దానికి ఎంత ఖర్చయిందో నీకు తెలుసా?" అన్నాడు శ్రీపతి గర్వంగా.

"ఏమో?" అన్నాను దాని విలువ వాడి నోటితోనే వినాలని తలంపుతో.

"ఏభైవేలు?" అన్నాడు.

ఆ సంఖ్య నాకేం ఆశ్చర్యం కలిగించలేదు. డబ్బున్న బాబులు సమాధుల కోసం ఎంతైనా ఖర్చుపెట్టడం మనకి కొత్త గనుకనా?

ఈజిప్టు రాజులు కట్టించిన "పిరమిడ్స్" షాజహాన్ ప్రేమ చిహ్నం "తాజ్‌మహల్" ఆయనగారి కుమారత్నం ఔరంగజేబు భార్య పేరున నిర్మించిన "బీబీమక్బారా" అందుకు నిదర్శనాలే గదా?

"ఇంతకీ ఎవరి సమాధిరా ఇది? మీ తాతదా? ముత్తాతదా?" అన్నాను.

"నన్నక్కడ పోతే దగ్గరగా వెళ్ళి దాని మీద చెక్కించిన అక్షరాలు చదవరాదూ ! కళ్ళజోడు తెచ్చుకోలేదా ఏరా?" అంటూ నవ్వాడు శ్రీపతి.

రిటైరైపోయాక నా బుర్ర సరిగా పని చెయ్యడం లేదేమో? వాడు సూచించే వరకూ నాకా ఆలోచనే రాలేదు.

సరే ! నేను మెట్లెక్కి సమాధి దగ్గరికి వెళ్ళి దాని మీదున్న పేరు చదివి అదిరి పోయాను.

అది శ్రీపతి గాడి పేరే. కాకపోతే వాడు చావబోయే తేదీ, మాసము, సంవత్సరము ఖాళీగా వుంచారు. చచ్చిన తర్వాత చెక్కుతారు కాబోలు.

నేను ఆశ్చర్యంతో మూర్ఛపోయినంత పనయింది. ఎవడి సమాధి వాడు కట్టించు కోవడం, పురాణాల్లోను, గత చరిత్రలోను వుందేమో గాని ఈ కాలంలో నాలాంటి వాడు. ఇటువంటివి వినడం చూడడం ఇదే మొదలు.

నేను వెర్రి మొఖం వెయ్యడం చూసి విఠల్‌రావు పకపక నవ్వుతూ "చచ్చిన తర్వాత అల్లుళ్ళు ఇంత ఖర్చుపెట్టి సమాధి కట్టిస్తారో లేదోనని వీడికి భయం. అందుకే ఆర్నెల్లు కష్టపడి సమాధి కట్టించుకున్నాడు. కొడుకులు లేరుగా పాపం" అన్నాడు.

"కొడుకులుంటే మాత్రం నువ్వు చేసిందేమిట్రా? చచ్చిన తర్వాత శవాన్ని కాల్చడానికి గంధపు చెక్కలు కొనిపెట్టుకోలేదూ?" అని విఠల్‌రావుని ఎత్తి పొడిచారు శ్రీపతి.

నాకీసారి పూర్తిగా మతేపోయినంత పనయింది.

"ఏమిటీ ! విఠల్‌గారు గూడా తక్కువ తినలేదన్నమాట. ఎప్పుడో చచ్చిన తర్వాత కాల్చడానికి గంధపు చెక్కలు కొనిపెట్టుకున్నాడన్న మాట. ఓరి వీళ్ళ వైభోగం పాడుగానూ!" అనుకున్నాను.

"దేరే ఈజ్ నో ఫూల్ లైక్ యాన్ ఓల్డ్ ఫూల్" అని ఎవరన్నారో గాని వీళ్ళ ధోరణి చూస్తే నాకు అది అక్షరాలా నిజమనిపించింది.

"మరి నువ్వు గంధపు చెక్కలు కొనలేదా?" అని శ్రీపతిని ప్రశ్నించాను.

అందుకు విఠల్‌గాడే సమాధానం చెప్పాడు.

"కొనేవాడేగాని వాళ్ళ కులంలో శవాన్ని కాల్చరు. పూడుస్తారు."

"మరి సమాధి కట్టేశారు గదరా ! నువ్వు చచ్చాక నీ శవాన్ని దానిలోపెట్టి ఎలా పూడుస్తారు?" అని నా సందేహం వెళ్ళబుచ్చాను.

"నీ తెలివి తెల్లారినట్లే వుంది. సమాధిని ఇంకా పూర్తిగా బిగించెయ్యలేదు, వీడు చచ్చాక దాన్ని తీసి పక్కనపెట్టి శవాన్ని పూడ్చి, తర్వాత శాశ్వతంగా బిగించేస్తారు" అంటూ వివరించాడు విఠల్.

"మరి నీ సంగతేమిటి? కాల్చిన తర్వాతైనా అస్థికలు ఉంచి సమాధి కట్టించాలి గదా? నువ్వెప్పుడు మొదలు పెడుతున్నావు?" అన్నాడు విఠల్‌తో.

"నాకా భయం లేదురా. యిద్దరు కొడుకులున్నారు. గ్రాండ్‌గా అంత్యక్రియలు చేస్తారు. వీడి సమాధిని తలదన్నేట్లు కట్టిస్తారు నా సమాధి !" అంటూ మీసం మెలేశాడు విఠల్.

"ఓరి వీళ్ళ గొప్పలు తగలబడిపోనూ?" అనుకున్నాను–వాళ్ళ ఆలోచనల ధోరణి తెలుసుకుని.

ఏరు ఎన్ని వంకరలు పోయినా సముద్రంలోనే పడాలన్నట్లు చచ్చిన తర్వాత నరకానికి పొయ్యేవాళ్ళకీ సమాధులు గురించి తాపత్రయాలు ఎందుకో – పిచ్చి గాకపోతే!

"ఉక్కు ముక్కల్లా వున్నారు మీకప్పుడే ఇదేం భయంరా !" అన్నాను.

"అరవై దాటుతున్నాయి. సర్వీసైపో వచ్చింది గదా ! ఏమో – రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?" అన్నాడు శ్రీపతి.

"సర్వీసైపోవచ్చినా కొత్త స్పేర్ పార్టు లేసిన బెంజి లారీల్లా సర్వీసు చేస్తూనే వున్నారు. అయినా యముడు అంత అర్జంటుగా రాడులేరా ! ముందు నోటీసు ఇచ్చిగాని బయల్దేరడు" అన్నాను.

"యముడైతే నోటీస్ సర్వ్ చేస్తాడనుకో - కాలయముడనే వాడు ఇంకొకడున్నాడు. వాడు వార్నింగివ్వకుండానే ఎండాకాలంలో తుఫాన్‌లా వచ్చిపడతాడు." అన్నాడు శ్రీపతి నవ్వుతూ.

"మరి నీ ఏర్పాట్లు ఏమిట్రా?" అన్నాడు విఠల్ నన్నుద్దేశించి.

"నాకూ మీకూ సామ్యమా? నక్కకూ నాగలోకానికీ పొత్తెక్కెడ?"

"అదేం మాట? నువ్వు తల్చుకుంటే ఒక సమాధి కట్టించుకోలేవా? ఒక మోపు గంధపు చెక్కలు కొనుక్కోలేవా?"

"లేవా అంటే లేను, వచ్చే పెన్షన్‌తో గుడ్డిలో మెల్లగా సాగుతోంది సంసారం. అయినా మీరు కీర్తిశేషులు కాబోతున్నారు గనుక ఆ మాత్రం శ్రద్ధ చూపించినా అర్థం వుంది."

"అంటే నువ్వు...."

"నేనా... అపకీర్తి శేషుడ్ని" అన్నాను ఫక్కున నవ్వుతూ.

వాళ్ళిద్దరూ విస్తుపోయారు.

"చచ్చాక నాకేం కీర్తి మిగులుతుంది చెప్పండి? మా నాన్న పెద్ద చదువులు చదివించి వుంటే ఏ డాక్టరో, ఇంజనీరుగానో నాలుగు చేతులా సంపాదించుకునే వాళ్ళం - ఎందుకూ పనికిరాని చదువులు చదివించి చచ్చాడు ముసలాడు అని తిట్టుకుంటూ కొడుకులు...నన్నీ గుమాస్తాకి కట్టబెట్టి గొంతుకోశాడు మా నాన్న, కట్నం ఎక్కువిచ్చి వుంటే పెద్దాఫీసర్ని చేసుకొని దర్జాగా కార్లల్లో తిరుగుతూ మేడలల్లో వుండే దాన్ని గదా అని కూతురూ తిట్టుకోక మానరు. మీరు అలా కాదు గదా ! పది తరాలు కూర్చుని తిన్నా తరగతి ఆస్తి సంపాదించి పిల్లలకిచ్చి పోతున్నారు. దాన ధర్మాలు చేసి పురప్రముఖులై పోయారు. ఇంట్లో డబ్బు ఊళ్ళో కీర్తి సంపాదించిన వారు గనుక మీరు కీర్తిశేషులు గాక ఏమవుతారు."

వాళ్ళిద్దరూ నవ్వుతూ కూర్చున్నారు.

అసంతృప్తికి హద్దులేదు కాబట్టి తృప్తిపడడం సుఖం. అదే సామెత నా జీవితంలో అక్షరాలా పాటించాలి. చచ్చిన తర్వాత నన్ను కాలుస్తారో లేదో...దినవారాలు చేస్తారో లేదో- పై లోకంలో వైతరిణిని దాటగలుగుతానో లేదో - అనే విషయాలు ఎప్పుడూ ఆలోచించలేదు.

★ ★ ★

సంవత్సరంపాటు ఎటూ కదలకుండా వుండేసరికి చిరాకనిపించి ఎటైనా వెళ్దాం అనుకుంటుంటే సమయానికి మా అమ్మాయి బెంగుళూరు నుంచి లెటర్ రాసింది. ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంటున్నాను వెంటనే రమ్మని.

ఆ లెటర్ చదివి మా ఆవిడ ఆనందానికి పట్టపగ్గాలేవు.

బెంగుళూరు వెళ్ళాక మా అల్లుడు ఎంతకీ కదలనివ్వలేదు. మూడు నెలలు గడిపి వచ్చాం.

వచ్చేసరికి పిడుగులాంటి వార్త తెలిసింది. శ్రీపతి లండన్‌లో ఉన్న కూతురు దగ్గరికి వెళ్తూ విమాన ప్రమాదంలో మరణించాడట. విమానం సముద్రంలో కూలిపోవడాన వాడి శవంకూడా లభ్యం కాలేదట.

ఆ వార్త విని ఎంతో బాధ పడ్డాను. మామిడి తోటలో తను నిర్మించుకున్న సమాధిలో శాశ్వతంతా నిద్రపోవాలనుకున్నవాడి ఆశ అడయాసయింది గదా !

"ఏభై వేలు ఖర్చుపెట్టుకున్న సమాధి శ్రీపతికి ఉపయోగపడకపోవడం నిజంగా చాలా చిత్రమనిపించింది. రేపు ఏం జరుగుతుందో, ఎవరు ఎక్కడ ఎలా మరణిస్తారో ఎవరూ చెప్పలేరు గదా ! సినిమా కవి రాసినట్టు "జగమేమాయ" గదా అనుకున్నాను.

శ్రీపతి ఇంటికి వెళ్ళి వాడి కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలిపి, ఆ తర్వాత విఠల్‌రావు దగ్గరికి వెళ్ళాను.

శ్రీపతిని తలుచుకుని వాడు కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. ఫస్ట్‌ఫారం నుంచి స్కూల్ ఫైనల్ వరకూ ఒకే బెంచీలో కూర్చుని గడిపిన రోజులన్నీ ఒక్కసారిగా గుర్తుకొచ్చి నాకూ దుఃఖం పొంగివచ్చింది.

తర్వాత నాకు ఆరోగ్యం బాగాలేక విఠల్ దగ్గరికి వెళ్ళడంగూడా కుదరడంలేదు ఎప్పుడైనా తీరిగ్గా వున్నప్పుడు వాడే వచ్చి చూసి వెళ్తున్నాడు.

వేసవి కాలం వచ్చింది.

మే నెలలో ఎండలు ఎడా పెడా వాయించేస్తున్నాయి.

ఒక రోజు విఠల్‌రావు వచ్చి "కాశ్మీర్ వెళ్తూన్నాం. మీ చెల్లాయి గూడ వస్తుంది. నువ్వు కూడా రారా !" అంటూ మొహమాట పెట్టేశాడు.

నాకు కోనసీమయినా, కాశ్మీరమైనా ఒకటే. కావాల్సింది కాలక్షేపం ఛలో కాశ్మీర్ అన్నాం.

ఒక బోట్ హౌస్‌లో మకాం పెట్టి అక్కడ వింతలూ విడ్డూరాలు చూసుకుంటూ సరదాగా కాలం గడుపుతూ వున్నాం.

ఒక రోజు సాయంకాలం టీ త్రాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నాం. విఠల్ వున్నట్లుండి గుండె దగ్గిర చెయ్యిపెట్టి బాధలో గిలగిల కొట్టుకోసాగాడు. సమయానికి ఆ

బోట్ హౌస్ యజమాని కూడా అక్కడే వున్నాడు. ఇద్దరం కల్సి హాస్పటల్‌కి తీసుకెళ్ళాం. కాని ఏం లాభం? తర్వాత అరగంట కూడా బ్రతకలేదు. హార్ట్ ఎటాక్‌తో కన్నుమూశాడు.

విఠల్ భార్య శోకం చూడలేక పోయాను.

కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, అశేష బంధుమిత్రులు ఉండి కూడా ఇక్కడ దిక్కులేనట్లు ఆఖరి శ్వాస విడవడం ఏమిటి? ఎంత విచిత్రంగా వుంది !

విఠల్‌రావు శవాన్ని ఎట్లాగైనా మా వూరు తరలించడానికి ఎంతో ప్రయత్నం చేశాను.

ఎక్కడ కాశ్మీర్, ఎక్కడ గుంటూరు?

ప్రత్యేక విమానంలో అయితే తప్ప వీలుకుదిరేటట్లు లేదు. డబ్బుకి వెనుకాడే ప్రసక్తి లేదు గాని, విమానం దొరికే వరకూ ఆగడం కంటే అక్కడే దహనం చెయ్యడం ఉత్తమం అని అందరూ సలహా ఇచ్చారు.

అంత్యక్రియలు అక్కడే చెయ్యక తప్పలేదు.

*–జయశ్రీ సంక్రాంతి ప్రత్యేక సంచిక, 1980*